క్లుప్తంగా

నాచారంలో గీతాపారాయణం



గీతాపారాయణం చేస్తున్న భక్తులు

ఏన్కూరు: మండల పరిధిలోని నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం గీతాపారాయణం నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి పుష్పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసి, భజన మండలి ఆధ్వర్యంలో గీతాపారాయణం చేశారు. ప్రధాన అర్చకులు నల్లాని చక్రవర్తుల శ్రీనివాసచార్యులు, సత్యనారాయణ, ఈఓ శేషయ్య పాల్గొన్నారు.

సన్మానం..



ఆకాష్‌ను సన్మానిస్తున్న రాములు నాయక్

ఏన్కూరు: ఇండియన్ నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా ఎంపికైన మండల పరిధిలోని నూకలంపాడు గ్రామానికి చెందిన పెద్దప్రోలు ఆకాష్‌ను మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆదివారం సన్మానించారు. నాయకులు బాణోతు సురేష్‌నాయక్, తదితరులు ఉన్నారు.

జైలు వార్డెన్‌కు..



కృష్ణార్జున్‌ను సన్మానిస్తున్న ఫాదర్ మనోజ్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన చాపలమడుగు కృష్ణార్జున్ జైలు వార్డెన్‌కు ఎంపికై ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని వరంగల్ జైలు వార్డెన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కృష్ణార్జున్‌ను స్వగ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మనోజ్ సన్మానించారు. ఆంధ్రప్ప, జోజి, రామారావు, నరసింహారావు, రఘు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

కారేపల్లి: మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామానికి చెందిన పొట్లకాయల వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు పగడాల మంజుల మాట్లాడుతూ.. మండలంలోని మున్నూరుకాపులు అందరూ ఐక్యంగా ఉండి, ఎవరికి ఆపద వచ్చిన వారిని ఆదుకోవటానికి ముందుకు రావాలన్నారు. నాయకులు అడప పుల్లారావు, పొట్లకాయల రమేష్, మండల అధ్యక్షకార్యదర్శులు గమిడి నరసింహారావు, ముత్యాల సురేష్, కోశాధికారి వాకాటి సురేష్, పగడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చింతకాని: చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్‌కు పార్టీ నాయకులు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు సకాలంలో వైద్యసేవల్ని అందించాలంటే అంబులెన్స్ సౌకర్యం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. అధికారులు తక్షణమే స్పందించి మండలానికి అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అనగాని రామారావు, ఇమ్మడి సత్యనారాయణ, నాయకులు కుందం అనంతరెడ్డి, గోద మంగయ్య, నాగాచారి, సత్తెనపల్లి గోపి, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

రంగు పూసుకున్న వివాదం

- గులాబీ రంగుబల్లల ఏర్పాటుపై అధికార పార్టీ నాయకులు గరం
- తెల్లరంగులోకి మారుస్తున్న వైనం
- పలుచోట్ల ఆందోళన చేస్తున్న నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన గులాబీ రంగు సిమెంట్ బల్లలపై వివాదం రేగింది. రూ.14 లక్షలతో 23 వార్డుల్లో 232 సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ పాలకవర్గం ఉపక్రమించింది. అంతాబాగానే ఉన్నా మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై వేసిన 'గులాబీరంగు'పై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేరుతో పాటు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆయా వార్డుల కౌన్సిలర్ పేర్లు రాయించారు. అయితే గులాబి రంగు సిమెంట్ బల్లలపై ఎమ్మెల్యే రాయించటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికార పార్టీ నాయకులు మండిపడుతున్నారు. ఈ మేరకు బల్లలను తొలగించాలని శనివారం హనుమాన్‌నగర్‌లో ఆందోళన చేసి ధ్వంసం చేయటం, మున్సిపల్ ఏఈ సురేష్‌తో వాగ్వాదానికి దిగటం తనకు ఏమి తెలియదని ఏఈ చెప్పటంతో కమిషనర్ రవిబాబుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు అధికార పార్టీతో సమాయత్తం కావటంతో ఈ వివాదం ఎటూ మలుపు తిరుగుతుందోనని అధికార, రాజకీయ పక్షాల్లో ఉత్కంఠ నెలకొంది.

రంగు మార్చాలని..

కాంగ్రెస్ ఎమ్మెల్యేగా డాక్టర్ మట్టా రాగమయి ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తుపల్లిలో గులాబీ రంగు బల్లలను ఏర్పాటు చేయడంపై అధికార పార్టీ నాయకులు మున్సిపల్ అధికార యంత్రాంగంపై మండిపడుతోంది. తక్షణమే రంగు మార్చాలని లేనిపక్షంలో బల్లలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇప్పటికే కొన్ని చోట్ల గులాబి రంగు సిమెంట్ బల్లలపై తెల్లరంగు మార్చటం చేస్తున్నారు.



గులాబీ రంగు వేసిన సిమెంట్ బల్ల

మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆధీనంలో..

సత్తుపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆధీనంలో ఉంది. దీంతో గులాబీ రంగు వేసినట్లు తెలుస్తుంది. 2019 సంవత్సరంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 23 వార్డులకు గాను 23 వార్డులు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. వీటిలో ఆరువార్డులు ఏకగ్రీవమయ్యాయి. కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణితో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరో ఐదుగురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ బలం 14కు పడిపోయింది. అయితే కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో కూడా గులాబీ రంగు బల్లలు వేయటం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 27తో మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో గులాబీ రంగు సిమెంట్ బల్లలపై వివాదం జరగడం అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది.

ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబును వివరణ కోరగా గులాబిరంగు సిమెంట్ బల్లల వ్యవహారం తనకు తెలియదన్నారు. రంగుపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.



తెల్లరంగులోకి మార్చిన సిమెంట్ బల్ల



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

మహిళలకు అగ్రతాంబూలం..

- ఎమ్మెల్యే రాగమయి

కల్లూరురూరల్: కాంగ్రెస్ హయాంలో మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చారని, మహిళ ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండలంలో ఆదివారం పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొర్లగూడెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను, పేరువంచ గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ను, ఎన్ఎస్‌పీలో, పుల్లయ్యబంజరురోడ్డులో నిర్మించనున్న రెండు పల్లె దవాఖానాలను ప్రారంభించారు. అదేవిధంగా పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్, కల్లూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భాగం ప్రభాకర్, పరిమి భరత్, కీసర మోహన్‌రెడ్డి, కీసర శ్రీనివాసరెడ్డి, వీరమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ..

కల్లూరు ఎన్ఎస్‌పీ క్రాస్‌రోడ్డులో గల శ్రీశ్రీశ్రీ మారెమ్మతల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే రాగమయి ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అమ్మవారికి మంత్రపుష్ప నీరాజనం మంగళహారతి, పంచామృత అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపకులు మేచర్ల నాగమల్లేశ్వరరావు, మాణిక్యమ్మలచే రూపొందించిన పత్రికను ఆవిష్కరించారు. మెదక్ జిల్లా తుప్రాన్ ఎక్సైజ్ సీఐ మేచర్ల రాధా, నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

అన్నదాతల్లో తుపాను ఆందోళన



ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచిన దృశ్యం

తల్లాడ: మళ్లీ తుపాను ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం వాతావరణంలో చల్లబడి మబ్బులు చేయడంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్, ప్లాస్టిక్ పట్టాలు కప్పారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యానికి పట్టాలు కప్పి ఉంచారు. వర్షం వస్తే వడ్లు తడిసి పోయి రంగు మారుతుందని వెంటనే ధాన్యాన్ని కాంటాలు వేయాలని రైతులు కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'సీఎం కప్'

మధిర: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తుందని సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ అన్నారు. మండల పరిధిలోని దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎంకప్ కబడ్డీ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ, మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై. ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, పీఈటీ చిన్ని, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వెంకటకృష్ణ

హరిహర నామామృత పత్రాలు అందజేత



పత్రాలను భక్తులకు అందజేస్తున్న దృశ్యం

మధిర: పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో హరిహర నామామృత పత్రాలను ఆదివారం భక్తులకు అందజేశారు. వెంకట వరప్రసాద్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి

పెనుబల్లి : బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే నేతృత్వంలో జరిగిన గ్రామాల అభివృద్ధి ఏమిటో వస్తే చూపిస్తామని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం వియంబంజర్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సండ్ర హయాంలో జరిగిన గ్రామాల అభివృద్ధికి చర్చకు సిద్ధమన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, వంగా గిరిజాపతిరావు, మందడపు అశోక్‌కుమార్, పసుమర్తి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, కొప్పుల గోవిందరావు, లగడపాటి శ్రీనివాసరావు, తావునాయక్, తోట రామారావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా..

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు: అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే మాళోతు రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదివారం ఆయన హాజరయ్యారు. భద్రుతండాలో బీటీ రోడ్డుకు, నూకలంపాడులో సీసీ రోడ్లకు శంకుస్థాపన, ఏన్కూరులో కల్యాణలక్ష్మీ, సీఎం రీలీఫ్ పండు చెక్కుల పంపిణీ, గురుకుల కళాశాలలో టీచర్ క్వార్టర్లకు శంకుస్థాపన, హిమామ్‌నగర్, పీకే బంజరలో పంచాయతీ భవనాల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నేరవేరుస్తుందని, వైరా నియోజవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో అన్ని మండలాలను అభివృద్ధి చేస్తామన్నారు. హిమామ్‌నగర్‌లో రైతులు సీతారామ లింక్ కెనాల్‌కు భూములు ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం విషయమై అసెంబ్లిలో మాట్లాడాలని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరావు, భూక్య కిషన్, మాళోతు నర్సింహారావు, గాలీబ్ తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలను బలోపేతం చేయాలి

సత్తుపల్లిరూరల్: పేదలకు ఆహార భద్రత కల్పించే చౌక దుకాణాలను బలోపేతం చేయాలని ఐద్వా మండల అధ్యక్షురాలు యలగం పార్వతి డిమాండ్ చేశారు. దుకాణాల నుంచి 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో సిద్ధారం గ్రామంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నిత్యావసర వస్తువులు బ్లాక్ మార్కెటింగ్‌కు నివారించడానికి, అధిక ధరల నుంచి పేదలను రక్షించడానికి రేషన్ షాపుల ద్వారా కేరళ తరహాలో సన్న బియ్యంతో వస్తువులను అందజేయాలన్నారు. వెంకటలక్ష్మి, సరోజిని, లక్ష్మి, కుమారి, రేణుక, సుజాత, పద్మ, నాగమణి, రమాదేవి, రాములమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్వతి

పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు

వైరా: మండల కేంద్రంలో శ్రీ కోదండరామాలయంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు నగర సంకీర్తన చేసి పడిపూజలో భజనలు చేశారు. గురుస్వాములు బాసటి రామారావు, శ్రీరామనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరావు

కొణిజర్ల: ఎస్సీల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. మండల అధ్యక్షుడిగా ఇలారపు మురళి, అధికార ప్రతినిధిగా కొర్లకంటి రవి, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా చాట్ల భాస్కరరావు, అధికార ప్రతినిధిగా గొరకపుడి భిక్షంబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రవి, వెంకటరత్నం, నాగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కొండయ్య

మధిర: మధిర పట్టణంలోని సామాజిక సేవకుడు లంకా కొండయ్యకు జీవీ అకాడమీ జోనల్ హెడ్ రాజేశ్వరి, మధిర జీవీ అకాడమీ స్కూల్ సిబ్బంది ఆదివారం రెడీమెడ్ దుస్తులను అందజేశారు. మిగిలిపోయిన స్కూల్ యూనిఫాంను పంపిణీ చేయాలని కొండయ్యకు అందజేయగా వాటిని నందిగామ రోడ్డులో ఉంటున్న సంచార జాతి కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి నాగార్జున్‌రావు, మునిగోటి వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కోలాట బృందానికి వితరణ

పెనుబల్లి : మండల పరిధిలోని రామచందర్‌రావు బంజర్ గ్రామంలో సీతారామా కోలాట కమిటీ బృందం గజ్జ పూజ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందానికి స్థానిక నాయకులు రూ.50 వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అలుగోజు చిన్న నరసింహాస్వామి, సోమరాజు సీతారామరావు, సానిక బీరప్ప, కోలాట బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గజ్జపూజలో పాల్గొన్న కోలాట బృందం

ఘనంగా ఇరుముడి



దీక్ష పూర్తి చేసుకున్న మాలధారులు

తల్లాడ: మండలకేంద్రంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లవరం రోడ్డులోని లక్ష్మీ నరసింహాఫ్రూట్స్ చాంబర్ వద్ద గురుస్వాములు ఈలప్రోలు లాలయ్య, పొన్నం శ్రీకాంత్ ఆధ్వర్యంలో అర్చకులు మణికంఠశర్మ గణపతి పూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం అనంతరం ఇరుముడి ధరింపజేశారు. అనంతరం మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై బి.కొండల్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, మొక్కా బసవయ్య, దూపాటి నరేష్‌రాజు, బొడ్డు మలయ్య, శ్రీను, ఈలప్రోలు వెంకటస్వామి, పెరికె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

ముదిగొండ: మండలపరిధిలోని పమ్మిలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం నిర్మాణం చేపట్టి సంవత్సరం అయిన సందర్భంగా బోనాల జాతర ఆదివారం నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో మహిళలు

అధ్వానంగా రహదారులు

- గుంతలమయంగా తెల్లపాలెం రోడ్డు
- విస్తరణ పనులతో ప్రత్యామ్నాయ రోడ్డుకు రద్దీ
- రోడ్డు పక్కన పెరిగిన పిచ్చికంప
- వాహనచోదకుల అవస్థలు

ఇటీవల వచ్చిన తుపాన్‌తో తెల్లపాలెం సమీపంలోని చెరువుకట్టకు పలు చోట్ల గండి పడి రోడ్డు కొట్టుకుపోయింది. మొనతేలిన రాళ్ల ప్రయాణానికి ఆటంకంగా మారదంతో పాటు.. రోడ్డంతా ఇరుకుమయంగా ఉంది.

ఎర్రుపాలెం: మండలకేంద్రం నుంచి వయా రామచంద్రాపురం, తెల్లపాలెం, కంద్రిక టూ జమలాపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎర్రుపాలెం టూ బంజర గ్రామాల మీదుగా ఉన్న ప్రధాన రహదారికి విస్తరణ పనులు నిర్వహిస్తుండటంతో ఈ ప్రత్యామ్నాయ రోడ్డే వాహదారులకు దిక్కుగా మారింది. దీంతో జమలాపురం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో పాటు సాధారణ జనజీవనంతో రద్దీ బాగా పెరిగింది. ప్రత్యామ్నాయ రోడ్డుగా ఉన్న ఎర్రుపాలెం నుంచి జమలాపురం గ్రామం వరకు 6 కిమీ దూరం ఏమాత్రం బాగోలేదు. రామచంద్రాపురం(హరిజనవాడ) నుంచి తెల్లపాలెం వరకు రోడ్డు అంతా గుంతలమయంగా మారింది.

వాహనచోదకుల ఇబ్బందులు..

రోడ్డు మార్జిన్ లేకపోవడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కంద్రిక నుంచి జమలాపురం దాదాపు 2 కి.మీ దూరంగా పైగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, కంప పెరిగింది. రోడ్డు మూసుకుపోయింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు హడలెత్తుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఉంది. రోడ్డు మార్జిన్ సక్రమంగా లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కంపను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు తెలిపినా.. అధికారులు, పాలకులు పట్టించుకోని పరిస్థితి. ఇకనైనా రహదారికి మరమ్మతులు చేయించి అనుకూలంగా మార్చాలని కోరుతున్నారు.



తెల్లపాలెం చెరువు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



కంద్రిక-జమలాపురం మధ్య పెరిగిన కంపచెట్లు

అధికారులు చర్యలు తీసుకోవాలి..



కంద్రిక-జమలాపురం రోడ్డుకు ఇరువైపులా దట్టంగా కంప, పిచ్చి మొక్కలు పెరిగాయి. జమలా పురం పుణ్యక్షేత్రానికి ప్రస్తుతం ప్రధాన రహదారికి విస్తరణ పనుల కారణంగా ఈరోడ్డు మార్గంలోనే భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సామునూరి కృష్ణార్జునరాజు, కంద్రిక

మరమ్మతులు చేయిస్తాం..



మండలకేంద్రం నుంచి వయా తెల్లపాలెం, జమలాపురం రోడ్డు మార్గంలో కంపచెట్లు పెరిగినమాట వాస్తవమే. ఈ కంపను త్వరలోనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. తెల్లపాలెం చెరువు వద్ద బీటీ తుఫాన్ వర్షాలకు కొట్టుకుపోయింది. అక్కడ కూడా మరమ్మతులు చేపిస్తాం.

– రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఎర్రుపాలెం

'వంటావార్పు'ను జయప్రదం చేయండి

వైరా: ఈనెల 16,17 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్లు నిర్వహించే వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు కోరారు. మండల కేంద్రంలో సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్కర్లు అప్పులు చేసి పిల్లలందరికీ నాణ్యమైన భోజనం పెడుతున్నారన్నారు. వారికి సకాలంలో బిల్లులు విడుదల చేయడం లేదని, వేతనాలు కూడ ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, వర్కర్లు ప్రమీల, మంగమ్మ, బి.కృష్ణవేణి, కరుణ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.